'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

బిర్యానీ షాదీమే అబ్దుల్లా దీవానా!

హుమాయున్ సంఘీర్

చికెన్ బిర్యానీ, చికెన్ ఫ్రై, హరా చికెన్, చీజ్, లాల్ చికెన్, లెగ్ పీసెస్, శీక్ చికెన్, ఫిష్ ఫ్రై, పాయా, రుమాలీ రోటీ, మటన్ కా కుర్మా, పరోటా, హలీస్, దహీ, మిర్చీ కుర్మా, క్యారట్ హల్వా, షాహీకే టుక్డే, ఖుర్బానీ కా మీఠా, ఫ్రూట్ కా మీఠా, కద్దూకి ఖీర్, పాన్, కూల్ డ్రింక్, ఐస్ క్రీం.

అబ్బబ్బా ఒకటా, రెండా.. ఇప్పుడు లేటెస్ట్ షాదీ, వలీమాలల్ల కనిపిస్తున్న ఐటమ్స్? సూశినోనికే 'అబ్బా..' అనిపించేటంతటి ఐటమ్స్! అన్నీ ఐటమ్స్ నూనెల ఇట్ల డైవ్ గొడ్తుంటయి. బావల్చీ ఖానా నిండా అండలే అండలు. ఏది తినాల్నో అర్థం గాదు. డైలమా! కన్ఫ్యూజన్! గిది టేస్ట్ సూద్దామా? గది టేస్ట్ సూద్దామా? అనుకొని అదొకటి, ఇదొకటి కడుపుల వడేస్తుంటే ఆయింత కడుపు నిండిపోతది. ఏదీ కుతారా తిన్నంత ఫీలింగ్ ఉండది. తిండి కాడ ఎసుంటి ఆంక్షలు పెట్టొద్దు.. ఎవరిష్టం వచ్చింది ఆల్లు తింటరు. అయితే ఆ తినే తిండి మన ఆరోగ్యానికి ఎంతవరకు మంచిది అనేది గూడ లెక్కలకు వస్తది కదా!

ఓ కోళ్లను జూశి ఇంకోళ్లు పోటీలు వడ్డట్టు రకరకాల ఐటమ్లతోని శుభకార్యాలను ఐటెం సాంగ్స్ ఈవెంట్స్ లెక్క జేసి పారేస్తున్నరు. వెయ్యి అవద్దాలు ఆడి సంబంధాలు ఎట్ల కాయం జేసుకుంటున్నరో ఆ లెక్కనే వంద అప్పులైనా జేసి పెండ్లి, వలీమాలు మా ఘనంగా జేసుకుంటున్నరు. కంటికి ఇంపుగ కనిపిచ్చే లెక్కలేనన్ని ఐటమ్స్. ఒక్క నాల్కెకు లెక్కకు మించిన రుచులు. తిని నెమరు వెడదామన్నట్టు మనకు లేకపాయె.. అయినా ఎగవడి ఎగవడి ఈర్‌మార్ తింటుంటం. తిన్నంక బదజ్మీ అని ఈనో తాగుడొకటి ఉంటది. శిన్న తిప్పలా.. లగ్గం వోయిన గాడిది ఇంత సుఖం యాడిది అన్నట్టు?

> గరీబోని బిడ్డె పెండ్లీల గూడ ఇన్నిగనం ఐటమ్స్ చెయ్యమని ఫర్మాయిష్‌లు వస్తున్నయి. తిండికే ఎటమటం పది లక్షల దాంక కర్సు అయితున్నది. ఇగ షాదీ ఖానా కిరాయ వేరు, ఇంకా ఇతర కర్సులు వేరు. ఎటు లేదన్నా 20 లక్షల దాంక కర్సులు జేస్తే గానీ, ఆడిబిడ్డె లేవని కాడికి వచ్చింది పరిస్థితి!

అంతగనం పైసలు కర్సువెట్టి గరీబోడు బిడ్డెను లేపియ్యాలంటే శెరవోవాల్సిందేనా? పాపం పేదోడు తిండికే అలమటిస్తుండంటే.. అన్నేసి పైసలు వెట్టి బిడ్డె లగ్గం జేస్తడా? ఆ తిండి కర్సులు తప్పిస్తే శాన పైసలు మిగులువాటు అయితయి. ఏమన్నంటే తిండి కాడనే పేరెల్తది అంటరు గనీ, దాని ఎనకాల గరీబోడు ఎంత నలిగిపోతడో ఒక్క క్షణం ఆలోచించరు? కొందరు వరకట్నం తీసుకోకుండా పిల్లను చేసుకుంటున్నరు. మరికొందరు ఎదురుకట్నం ఇచ్చి మరీ పెండ్లి చేసుకుంటున్నరు. కనీ తిండి కాడ మాత్రం అస్సలు ఫరక్ రానిస్తలేరు.

ఇంకొందరైతే పోష్ కల్చర్‌కు కట్టు బానిసలు అయినట్టు జరజరంత తినుకుంట అటు పారేస్తుంటరు. టేబుల్ మీద సగం సగం సుతారంగ తిని పారేస్తున్న ఆ అన్నాన్ని జూశి శిన్న కలకలగాదు. అయ్యో లగ్గాలల్ల ఎంత పుడ్డు వేస్టు జేస్తున్నరో గదా? ఎన్కటికి మంచి ఉప్పూకారం తిన్నోళ్లకు గా వంటలు అస్సలు రుచించయి. కడుపులనేమో ఆకలి. ఏదో ఒకటి లోపల పారేసి నింపుకొని ఆకలి మంట మీద సప్పున లీల్లు గుమ్మరిచ్చుకునాలె అనకుంటరు. రుచి అందుతదేమోనని దన్కాంచి మడ్క వెడ్తుంటరు కొందరు బేగానేకి షాదీమే అబ్దుల్లా దివానా అసుంటోళ్లు. ఒక్కదాంట్ల గూడ నో ఉప్పూ, నో కారం! అంతా సప్పసప్పగ! ఏదో షుగర్ పేషెంట్లు తినే తిండి లెక్క?

ఇది అప్పులపాలైన పిల్లోల్ల తంతు అయితే.. పిలగానోళ్లు ఇంకో రెండాకులు ఎక్వ సదివినట్టు కట్నం పైసలను ఆయింత అటే ముట్టజెప్పినట్టు ఐటమ్లతోని షాదీఖానాల ధూం మచాయిస్తరు. నో కాంప్రమైజ్.. వీళ్లకన్నా ఇంకో రెండు మూడు ఐటమ్స్ ఎక్కువే ఉండేటట్టు సూసుకుంటరాయె. మీదికెల్లి పుదీనా హార్లు, బ్యాండ్‌మేళాల నాగిని డ్యాన్సులు అబ్బబ్బా.. శెప్పతరం గాని తంతులు? ఏందో ఈ ఆర్భాటపు పెండ్లీలు? ఉన్నోనికి ఉట్ల పండుగ.. లేనోనికి అప్పుల పండుగ అన్నట్టే ఉంటున్నయి. సాదాసీదా అనే పదం అన్నిట్ల అప్లై అయితది గనీ, లగ్గాలు, రిసెప్షన్లకు మాత్రం అస్సలు అప్లై గాదు! ఎందుకంటే అక్కడనే గదా మనిషి తన షాన్‌తనం ప్రదర్శిచ్చేది?

> చిన్నప్పుడు పెండ్లీలకు పోతే ఉంటుండే మజా.. ఇంటికచ్చినంక గూడ ఇంకా చేతి వేళ్లను నోట్లేసుకొని కంకుతుంటిరి? ఇప్పుడట్ల ఎవరన్న జేస్తున్నరా? మస్తు గుంజినంరా నాయినా.. మంచి బువ్వ వెట్టిండు. వాని కడుపు సల్లగుండ. తుర్కోళ్లు మస్తు మజాగ వండుతరు అని ఎవలన్న యాజ్జేస్తున్నరా? ఇప్పటి ఫంక్షన్ తిండ్లకు తుర్కోళ్ల పేరు వెట్టే సాహసం జేస్తరా? ఎటు వోయినయి ఆ పాత లగ్గం తిండ్లు?

బగారన్నం, మటన్ కూర, దాల్చ, డబల్ కా మీఠా.. వహ్ ఏం రుచి అది. నైంటీస్ వరకు లగ్గాలల్ల గా బగారన్నం, దాల్చలే రాజ్యాలు ఏలినయి. రెండు మూడు అండలు దిగుతుండే. దాల్చల ఆనెక్కాయలు, మటన్ బోటీ ఉంటది. ఎర్రటి దస్తర్ ఖాన్ మీద తెల్లటి గిన్నెలు వెట్టి దాని మీద ముష్కాబ్‌లల్ల బగారన్నం, కూర గిన్నెలల్ల దాల్చ, మటన్ కూర, డబల్ కా మీఠా లేదా మీఠా ఖానా వెడ్తుండే. ఇప్పటి లెక్క ఎడ్లోలె లిల వడో, కాలు మీద కాలు ఏసుకొని కూసుండో తిన కుంట, నేల మీద సక్లంముక్లం కూసుండి తింటుండ్రి గదా. అట్ల గా బగారన్నాన్ని గిన్నెల వెట్టుకొని అన్లకు మటన్ కూర, దాల్చ ఏసుకొని బుక్కలు తింటుంటే నా సామిరంగా ఉంటది మజా. గా మజా ఎటువో యిందోనని గిప్పుడు దుర్బిన్ వెట్టి లెంకునే రోజులు అచ్చి కాలవడ్డయి కదా?

ఘుమఘుమలాడే ఆ వాసన ఎంత కమ్మగ అనిపిస్తది. 'కడుపులు కడుక్కున్నం' అని అంటరు గదా అట్ల ఇప్పుడెవలన్న గీ పోష్ ఫంక్షన్లల్ల మెక్కుతున్నరా? డౌటే? కడుపు నిండ తిని బ్రేవ్ మని త్రేన్చే తిండి కాదు గదా ఇది. తిన్నంక కడుపుల లొడలొడ అని దేవకపోతే అదే పదివేలు. బగ్గ దిష్టి తలిగిన బేకొట్ల లెక్క వస్తే మాత్రం.. ఆ పెండ్లికి ఎందుకెళ్లినా నాయినా.. అనే ఇరిటేటింగ్ ఫీలింగ్ కలగకమానదు. గ్యార్మీ పండుగప్పుడు మాత్రమే కొందరు గా బగారా, దాల్చ చేస్తున్న దాఖలాలు కానస్తున్నయి. అవిటిలల్ల గూడ బిర్యానీ చేసి మస్తుగ అప్‌డేట్ అయితున్నరు నయా జమానా మనుషులు!

చేయి కడుక్కొని ఆ పోష్ కల్చర్‌ను అలవాటు చేసుకుందాం అని బీరాలుపోతున్న వాళ్ల నడుమ నుంచి అవుతలవడ్డడు బీరిపోయిన అబ్దుల్లా. ఫంక్షన్‌హాలు బయట కొంతమంది ముష్టోళ్లున్నరు. ఇప్పుడేం లేదు ఫంక్షన్ అంతా అయిపోయినంక రండ్రి అని పెండ్లికి అచ్చిన ఒగ సుట్టపాయిన వాళ్లను ఈగలను అదిలిచ్చినట్టు అదిలిచ్చుకుంటగదిరిస్తున్నడు. వాళ్లను సూడంగనే అబ్దుల్లాకు పాపం అనిపిచ్చింది. మనసు మెరమెర అన్నది. పెండ్లికి వచ్చినోళ్లల్ల వీళ్లంత ఆకలైతే ఎవరికీ అయి తలేదు. ఆకలికి అసలుసిసలైన రూపాలు వీళ్లు. ఆకలైనోనికే గదా ముందుగాల్ల పట్టెడు బువ్వ పెట్టాలె. గీ పెండ్లికచ్చినోళ్లల్ల ఏ ఒక్కరు గూడ తృప్తిగ త్రేన్చినట్టు అనిపియ్యలేదు. ఆకలైనోడి కడుపు నిండినప్పుడు ఉండే తృప్తి గదా ఆ లగ్గానికి వన్నె తెచ్చేది, అల్లా ఖుష్ అయ్యేది.

గప్పుడే అబ్దుల్లా ఒక నిర్ణయానికచ్చిండు. నా లగ్గం గిన అయితే ఇంట్ల కొట్లాడి మరీ బగారన్నం, దాల్చ జేపిచ్చి ముందుగాల్ల ఇట్ల ఆకలైనోళ్లకే బువ్వ వెడ్త హా.. అని గట్టిగ నిర్ణయించుకున్నడు.

'గా బగారన్నం, దాల్చ గిప్పుడెవలు జేస్తున్నరు? చికెన్ బిర్యానీ రోజుల్ల ఉన్నం మనం అప్‌డేట్ గావాలె. పాత పురాణం లెక్క గా బగారన్నం, దాల్చ పిచ్చి వట్టుకుంది ఏందిరా నీకు' అని అంటే మాత్రం నాకు లగ్గమద్దు ఏమద్దు అని లైఫ్ లాంగ్ లగ్గమే జేసుకోకుంట ఒంటిగుండిపోత అని మన సుల గట్టిగ అనుకున్న అబ్దుల్లా 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అనే రివాజును షురు జెయ్యాలనుకుంట ఇంటికి వోయిండు. టేబుల్ మీద వెయిటర్లు దన్కాంచి ఐటెమ్ల ఎన్క ఐటెమ్లు పెడుతున్నరు. అవిటిని జూశి అబ్దుల్లాకు మొకం తింపింది. కడుపుల కసబిస అన్నది. ఇకారం అస్తున్నది. అట్లనే నిలువు నిస్తారం లేశిండు. అక్కడ ఏం తినకుంటనే ఒసోస అనుకుంట ఇంటికచ్చిండు. గిన్నెల తెల్ల బువ్వ వెట్టుకొని కారం, నూనె, ఇంత అల్లమెల్లిగడ్డను కలుపుకొని నోటికి కారం తగిలెటట్టు తిని తృప్తిగ బేకోట్ తీశిండు.

ఎటమటం

మై హూనా

'ఒకపక్క అపార రాజకీయ అనుభవం. మరోపక్క ఎక్కువకాలం మంత్రిగా పనిచేసిన రికార్డు, పరిపాలనా అనుభవం ఉంది. మీకు ఎప్పుడు ఏ సూచన, సలహాలు కావాలన్నా అడగండి.. చెబుతా. ప్రభుత్వానికి నావంతుగా సహాయపడుతా. పైగా ఇంట్లో ఖాళీగానే ఉంటున్నా. గత ప్రభుత్వానికి కూడా ప్రతిపక్ష నాయకునిగా ఎన్నో సలహాలు ఇచ్చిన. కావాలంటే తెలుసుకోవచ్చు. అసెంబ్లీ లైబ్రరీలో వెతికినా లభిస్తాయి. పరిశీలించుకోవచ్చు. మరి ఇంత టాలెంటున్న నన్ను వదిలేసి ఇతరులను సలహాదారులుగా పెట్టుకోవడమేంటి?' అని జానారెడ్డి పరోక్షంగా ప్రశ్నిస్తున్నారు. నా టాలెంట్ వాడుకున్నోడికి వాడుకున్నంత అంటున్నారు పెద్దలు జానారెడ్డి. తమది కొత్త ప్రభుత్వం, కొత్త సంసారం అన్న బెంగ వద్దేవద్దు.. మై హూనా అంటున్నారాయన.

వదిలేయండి ప్లీజ్

ఒకప్పుడు పబ్లిసిటీ కోసం మీడియా వెనుకపడే రాజకీయ నాయకులు.. ఇప్పుడు 'మమ్మల్ని వదిలేయండి ప్లీజ్' అని దండం పెడుతున్నారంటే ఆశ్చర్యపడక తప్పదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలలో పేపర్ టైగర్లంతా ఓడిపోయారని పొలిటికల్ సర్కిల్‌లో విశ్లేషణ ఒకటి చక్కర్లు కొడుతున్నది. దీంతో మీడియాకు ఎంత దూరంగా ఉంటే.. అంత బెటర్ అన్న ఫీలింగ్‌తో వారంతా ఉన్నారు. మీ పార్టీ గురించి ఫలానా ఆయన అలా అన్నారు.. మీరేమంటారని మాజీ మంత్రి ఒకర్ని అడిగితే, 'నో కామెంట్' నన్ను వదిలేయండి ప్లీజ్ అని దండం పెట్టారు. అయినదానికి కానిదానికి ప్రతీదాంట్లో తగదునమ్మా అని దూరిపోయే మా జిల్లాకు చెందిన నాయకుడి పరిస్థితి ఏమైందో తెలుసుకదా అని సదరు నేత తప్పించుకున్నారు.

గెలిచింది మా వల్లే!

గాంధీభవన్‌లో ఏ కార్యక్రమం జరిగినా సోషల్ మీడియా పేరుతో వచ్చే వారిని తట్టుకోలేకపోతున్నామని మీడియా వ్యవహారాల ఇంచార్జి బేజార్ అవుతున్నారు. ఎల్‌బీ స్టేడియంలో ఆ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఆ కార్యక్రమాన్ని కవర్ చేయడానికి మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా పాసులు జారీ చేశారు. బీట్ రిపోర్టర్లు, కెమెరామెన్ల సంఖ్య మేరకే పాసులు ముద్రించారు. కానీ, సోషల్ మీడియా పేరుతో వచ్చిన వారు పాసుల కోసం ఎగబడ్డారు. కాస్తో, కూస్తో గుర్తింపు ఉన్న మీడియాకు అయితే పాసు ఇస్తాం కానీ, మీరంతా ఎవరని మీడియా ఇంచార్జి ప్రశ్నిస్తే, 'ఏం సార్ అలా అంటారు. మా వల్లనే మీ పార్టీ గెలిచిందని అందరూ అంటుంటే.. మీరేమో ఇలా అంటున్నారు ఏంటి' అని సదరు వ్యక్తి ప్రశ్నించే సరికి అక్కడున్న వారు ఉలిక్కి పడాల్సి వచ్చింది.

ఆ ముక్క ముందే చెప్పాలి

'ఆ ముక్క ముందే చెప్పాలి' ఇది ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాల్‌రావు చెప్పిన పాపులర్ డైలాగ్. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి చెప్పిన కథ వింటే, ఈ డైలాగ్ గుర్తుకు రాకతప్పదు. 'దవాఖానలో చావుబతుకుల మధ్య ఉన్నప్పుడు పట్టించుకోనోడు.. చచ్చినంక వచ్చి డప్పులోళ్లకు పైసలు పంచిండంట ఎనకటికి ఒకడు' నా పరిస్థితి కూడా అచ్చం అలాగే ఉందని జగ్గన్న వాపోయారు. నేను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఒక్కడంటే ఒక్కడు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. ఓడిపోయినంక వచ్చి 'అరే అన్నా, నాకు చెప్పొద్దా పైసలు పంపిస్తుంటి' అని సింపతి చూపిస్తున్నారు అని వాపోయారట. నాపై అభిమానం ఉంటే ఓడిపోకముందు అనాలి ఆ మాట, ఇప్పుడు అంటే ఎట్టా? అని జగ్గన్న గుస్సా అయ్యారట.

- వెల్జాల

స్వచ్ఛంగ తెలుపుతున్న. సరిగ్గ ఈ కంపోజింగ్ టైంల కరెంటు లేదు. శుక్రవారం పొద్దుగాల పావుదక్వ పదకొండిట్కి పోయింది. మళ్ల పగటేల 12.20 కొచ్చింది. కమ్ సే కమ్ గంటన్నర గుటుక్కుమన్నది. ఇంక కడమ దినంల ఇట్ల రెండు మూడు తాపల జెరంత మిట్కరిచ్చుడు రివాజైతున్నది. రాజధాని నగరంల అల్వాల్ సైడుల మా అపార్టుమెంట్ వాచ్‌మెన్ పోచయ్యకు నెల కిందనే చెప్పిన. మార్పు వస్తుంది జాగ్రత్త. జెర అప్పుడప్పుడు జనరేటర్ ఆన్ చెయ్యి అని.

పిల్వంగ పిల్వంగ వారానికొచ్చిండు...

కరెంటే పోదుగదా అనే నమ్మిక పదేండ్ల సంది పోచయ్య మైండ్ల గట్టిగ నాట్కపోయె. ఇశార చెయ్యంగనె ఇనెతందుకు తనకు టైం పట్టింది. ఆ టైం పట్టుడు..కంప్లీట్ అవుడు, తను మార్పునకు తగ్గట్టు ట్యూన్ గాకడ ఒకపారే ఏకకాలంల జరిగినై. రానే వచ్చిండు నా తానికి. జనరేటర్ చాల్ అయిత లేదు. కరెంటేమో పోవట్టె అని చెప్పుకచ్చిండు. మొదాలె చెప్తే ఇనక పోతివి..ఖిన్నతంగా యాజ్జేశి, వెంటనే మెకానిక్ ఆంజనేయులుకు ఫోన్ చేశిన. గిట్ల గిట్ల అని తక్లీబు తెలిపిన. సరే వస్త అన్నడు. ఎప్పుడస్తడో ఫిక్సుడు టైం ఎందుకు చెప్పలేదో దినం గడిచిన కొద్దీ జెరంత జెరంత మన్సనవడుతుంది. ఎందుకంటే, శాతకు మించిన అసైన్‌మెంట్లు ఆఫీసు తనకు వేస్తున్నది. ఒక్కసారిగ జనరేటర్ల మరమ్మతులు అమాంతం పెరుగుతున్నయి.

ఇటూఅటూ పరుగులు తీసుడు మెకానిక్ వంతైతున్నది. మా ఆస్థాన మెకానిక్ అతనే. జనవరి 11 నాడు రిక్వెస్ట్ జేశిన. రోజులు గడువవట్టె. రోజూ వస్తా వస్తా అంటుండె గానీ, రోజులు గడుస్తున్నా తాను వచ్చే రోజు వస్తలేదు. లిఫ్ట్‌ల ఎవలైన ఉన్నప్పుడు కరెంటు పోతే ఎట్టా? అని నా రంది నాది. ఆంజనేయులు నంబర్ వాచ్‌మెన్‌కు, తక్కిన ఫ్లాట్ల ఓనర్లకు ఫాలో అప్ కోసం షేర్ చేశిన. మొత్తానికి ఆరొద్దులకు 17న మెకానిక్ దర్శన భాగ్యం కలిగింది. జనరేటర్ చెక్ చేశిండు. ప్రాపర్‌గా యూజ్ (ఆన్) చేయనందున బ్యాటరీ డౌన్ అయిందని తేల్చిండు. సపోర్ట్ ఛార్జర్ పెట్టుకోవాలన్నది తన సజెషన్. అది రూ.6,500 ఉంటుందన్నడు. ఇప్పటికిప్పుడు అంత ఇన్వెస్ట్ ఎందుకనే ఒపీనియన్ అపార్ట్‌మెంట్ల వచ్చింది. కాబట్టి తక్షణ కర్తవ్యంగా ఆ బ్యాటరీని నా బండి మీద పెట్టుకొని వాచ్‌మెన్‌తో కలిసి ఓల్డ్ అల్వాల్ బ్యాటరీ కమ్ ఇన్వర్టర్ల షాపునకు పోయినం. దానికి ఛార్జింగ్ పెట్టాలె. ఇప్పుడు బిజీ. రేపు పగలు గీ టైంకు తీస్కపోన్రి అన్నడు దుకాణదారు. చార్జింగ్ మీదట వాచ్‌మెన్ 18 నాడు బ్యాటరీ తెచ్చిండు. మెకానిక్‌కు అప్‌డేట్ చేశినంక పూటకు టైం ఇచ్చి, వచ్చిండు. బ్యాటరీ ఫిక్స్ చేశి, జనరేటర్ ఆన్ చేశిండు.

> కరెక్ట్ వారానికి, రూ.1,380 బిల్లుతోని జనరేటర్ సప్పుడు ఇన్నం. కరెంటు పోతనే ఉన్నది. జనరేటర్ సౌండ్ ఇంటనే ఉన్నం. డీజిలు స్టాకు గురించి మల్ల వాచ్‌మెన్‌ను అలెర్టు చేశిన. ఎందక్వ పదేండ్లు జనరేటర్లు, ఇన్వర్టర్లతోటి అక్కెర బగ్గ తగ్గె. ఇప్పుడేమో రోజులు మారె. మార్పు వచ్చె.

ఎంత మెయింటెనెన్సు పేరు చెప్పి, కరెంటు కట్ చేస్తున్నా.. పోయిన దస్ సాళ్ల మెయింటెనెన్సు లేకుండెనా ఎట్లా? అప్పుడు సుత ఉండె. కని కరెంటు గీ తరీక పోకపోతుండె. అంతెందుకు? 2014కు ముందు చినుకు వడితె సటుక్కున ఫస్టు కరెంటు గాయబ్ అయితుండె. చూశీ చూశీ ఓ దినం గిట్లనె అయితే, కేటీఆర్ యాష్టపడ్డరు. వాన వస్తే కరెంటు పోవుడు.. గిదేం దరిద్రం? అని అన్న ఘడియలు మొదలుకొని 2023 నవంబరు దాన్క ఆ దరిద్రం కొట్టుకపోయింది. వాన, సలి, ఎండతోటి నిమిత్తం లేకుండ మల్ల ఆ దరిద్రం మోపైతున్నట్టున్నది!

- ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384

ఓడిన తెలంగాణను గెలిపించిన నేత

'బీఆర్ఎస్‌ను బొందపెడతాం' సాక్షాత్తూ ఓ ముఖ్యమంత్రి అన్న మాట ఇది. 'బీఆర్ఎస్‌ను ముక్కలు ముక్కలుగా చేస్తాం' మరో మంత్రి అక్కసు వెళ్లగక్కిన తీరిది. 'మనం తర్వాత పోటీ పడొచ్చు కానీ, ముందు బీఆర్ఎస్‌ను ఓడిద్దాం' బీజేపీ ఎంపీ బండి సంజయ్ చెప్పిన మాట ఇది. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బీఆర్ఎస్‌పై అటు కాంగ్రెస్.. ఇటు బీజేపీ నేతలు చేస్తున్న అహంకారపూరిత వ్యాఖ్యలివి.

కాంగ్రెస్ గద్దెనెక్కి నెల రోజులు కూడా గడవకముందే ప్రజలు వాస్తవాన్ని గ్రహించారు. ఇంటి పార్టీని దూరం చేసుకున్నామనే నైరాశ్యంలో పడ్డారు. ఇంత త్వరగా ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల సానుకూలత వస్తుండడాన్ని రెండు జాతీయ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అందుకే బీఆర్ఎస్‌ను బలహీనపరచాలనే కుట్రలు జరుగుతున్నాయి.

సంపత్ గడ్డం
78933 03516

నాడు ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షాన నిలబడని వ్యక్తులు నేడు బీఆర్ఎస్‌ను లేకుండా చేస్తామని మాట్లాడుతున్నారు. నిజంగా ప్రజల్లో ఆ పార్టీలపై, వారి నాయకత్వంపై విశ్వాసం ఉంటే ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయరు. కానీ, కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణపై ప్రేమ కంటే.. అధికారం మీద వ్యామోహమే ఎక్కువ. అందుకే బీఆర్ఎస్‌ను చీల్చుతామంటూ మాట్లాడుతున్నారు. వారు అభద్రతా భావంతో ఉన్నారనేది దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. వారు నిజంగా అలాంటి పరిస్థితుల్లోనే ఉంటే తెలంగాణ ఉనికిని మరోసారి లేకుండా చేయడానికి కూడా వెనుకాడరు. పదే పదే కేసీఆర్ మీద కోపంతో బీఆర్ఎస్‌ను లేకుండా చేస్తామని మాట్లాడుతున్న నాయకులు భవిష్యత్తులో తెలంగాణను రాష్ట్రంగా ఉండనిస్తారా? అనే అనుమానం కూడా వ్యక్తమవుతున్నది. వారి ఆవేశపూరిత అక్కసును చూస్తుంటే.. భవిష్యత్తులో తెలంగాణను ఆగమాగం చేయటం ఖాయమనిపిస్తున్నది. ఆ దిశగా రెండు జాతీయ పార్టీలు రాజకీయ ఉనికి కోసం తెలంగాణను బలిపీఠం మీదకు తీసుకుపోతాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తప్పులు ఎంచుతూ, లోపాలు చూపే ప్రయత్నం చేస్తూ కాలయాపన చేస్తున్నది. అందులో భాగంగానే బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు.

> ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొందాల్సిన అధికార పార్టీ అందుకు భిన్నంగా వ్యక్తిగత రాజకీయ కక్ష సాధింపులకు ఉసిగొలిపే మాటలకు తెరలేపడం సరికాదు. బీఆర్ఎస్ పార్టీ లేకుంటే తెలంగాణ ఎప్పటికీ వచ్చి ఉండేది కాదు. ప్రజల తరపున బీఆర్ఎస్ విసిరే సవాళ్లను ఎదుర్కొనే శక్తి లేకనే, జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్నాయి. దాన్ని మనం మరింత సూక్ష్మంగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.

తాను గెలవడమే ప్రతి రాజకీయ నాయకుని లక్ష్యం. అధికారంలో ఉండి, పదవులు అనుభవిస్తూ, పెత్తనం చెలాయించాలని ఆరాటపడుతుంటారు చాలామంది. అటువంటి వారే రాజకీయాల్లో ఎక్కువగా కనిపిస్తుంటారు. ఎన్నికల్లో గెలవడం, పదవులు అనుభవించడం సర్వసాధారణం. కానీ, తన గెలుపును ప్రజల కోసం ఎలా ఉపయోగించాలి? అనే విషయాన్ని కొద్ది మంది మాత్రమే ఆలోచిస్తారు. అటువంటివారు తన గెలుపుతో ప్రజల బతుకుల్లో ఎలా వెలుగులు తీసుకురావాలి? అని ఆలోచిస్తుంటారు. తన గెలుపులో ప్రజల గెలుపును చూసుకుంటుంటారు. అటువంటి అరుదైన నాయకుల్లో కేసీఆర్ ఒకరు. తన గెలుపు ప్రజల జీవితాల మార్పునకు ఏవిధంగా ఉపయోగపడుతుందని ఆలోచించి, ఆచరించే నాయకుడు కేసీఆర్. అడుగడుగునా ఆగమైన తెలంగాణను గెలిపించడానికి కేసీఆర్ చేసిన త్యాగం అంతాఇంతా కాదు. ఈ పదేండ్లను పరిశీలిస్తున్న మనం, ఆరున్నర దశాబ్దాల అణగారిన మన ప్రాంతాన్ని ఒక్కసారి తలుచుకుంటే 'తెలంగాణకు కేసీఆర్ విజయ తిలకమే' అని అర్థం కాకుండా ఉండదు.

జయశంకర్ సార్ లాంటి సిద్ధాంతకర్త కూడా 'కేసీఆరే తెలంగాణను సాధించగలడు. మరెవరూ సాధించలేరు' అని అన్నారంటేనే కేసీఆర్ నాయకత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణను సాధించాలన్న కృషి, పట్టుదల, తెగింపు కేసీఆర్‌లో ఏ స్థాయిలో ఉంటే.. జయశంకర్ సార్ ఆ మాట అనగలరు అనేది మనం గుర్తెరగాలి. ఆనాటి నుంచే కేసీఆర్ తెలంగాణకు విజయ తిలకం అయ్యారు. స్వచ్ఛమైన తెలంగాణ యాస, భాషలో, మహాత్మాగాంధీ పంథాలో, అంబేద్కర్ విధానాలతో ఆయన నడిచిన ఉద్యమ తోవ చరిత్రలో ఎప్పటికీ చెరపలేనిది. ఆదిలాబాద్ నుంచి ముదలుకొంటే ఖమ్మం వరకు ప్రతీ అంగుళం అవపోసన పట్టి, చీకట్లో మగ్గుతున్న తెలంగాణకు ఆయన వెలుగయ్యారు. బలిపీఠం మీద బలవుతున్న తెలంగాణ సమాజానికి ఆయన కొండంత భరోసా అయ్యారు. ఇదంతా ఆయన పదవులను ఆశించో, హోదాను ఆశించో చేసింది కాదు.

కేసీఆర్ భయపడే వ్యక్తో, అధికారం అంటే ఆశ ఉన్న వ్యక్తో కాదు. కేసీఆర్‌కు పదవులపై వ్యామోహమే ఉంటే.. 14 ఏండ్ల ఉద్యమ సమయంలో తీవ్రమైన మానసిక సంఘర్షణలు, బెదిరింపులను తట్టుకోలేక పక్కకు తప్పుకొనేవారు. కేసీఆర్‌కు ఓటములు కొత్త కాదు, ఆయన అధికారం కోసం ఆరాటపడే వ్యక్తి కాదు. ప్రజల ఆకాంక్షల కోసం అవతరించిన పార్టీ బీఆర్ఎస్. నేటి ఓటమిని సమీక్షించుకొని భవిష్యత్తులో మరో గొప్ప విజయానికి నాందిగా రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లో ఉండాలి. ప్రజల గొంతుకగా మారాలి. దేశ రాజకీయాలపై కేసీఆర్ అనే మూడు అక్షరాల చరిత్ర ఆవిష్కృతం అయ్యేలా మరింత దీక్షతో ముందుకు సాగాలి.



కాంగ్రెస్ వల్లే 'ఇండియా'లో చీలికలు

'ఇండియా' కూటమి తొలి సమావేశం బీహార్‌లోనే జరిగింది. కూటమి ఏర్పాటుకు పునాది వేసింది ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమారే. కానీ, ప్రస్తుతం ఆయనే అందరి కంటే ముందుగా కూటమికి దూరమవుతున్నారు. 'ఇండియా' కూటమిలో చీలికలకు కాంగ్రెస్సే కారణం. కూటమి పార్టీల మధ్య సఖ్యత కోసం చర్చలు జరపాలన్న ఉత్సాహం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. హస్తం పార్టీ చొరవ చూపితే ప్రస్తుత సమస్య ఓ కొలిక్కి వస్తుంది.

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత